
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 8 జూన్ 2025



ప్రశాంత తీరం.. కాలుష్య కల్లోలం



నేడు ప్రపంచ మహా సముద్రాల దినోత్సవం

సముద్రం.. సమస్త జీవరాశులకు మూలాధారం. ప్రాణవాయువు కూడా. సముద్రంలోని ఆల్గేగా పిలిచే పైటోప్లవకం (నిమ్న వృక్షజాతి) దాదాపు 25శాతం ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తోంది. సంద్రం ద్వారా మత్స్యసంపదతోపాటు.. మాంగనీసు, కోబాల్టు, నికెల్ వంటి లోహమూలకాలతో ఉపాధి లభిస్తోంది. బంగాళాఖాతం తీరానికి చెంతనే జిల్లా ఉండడం గొప్ప వరం. అయితే మానవ తప్పిదాల కారణంగా సముద్రం కాలుష్యంబారిన పడుతోంది. తరచూ విపత్తుల రూపంలో అలజడి రేగుతూ తీరని నష్టం వాటిల్లుతోంది. ఆదివారం ప్రపంచ మహాసముద్రాల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- జిల్లాకు చెంతనే బంగాళాఖాతం
- మానవ తప్పిదాలతో ప్రమాదకరం
- ఏటా విపత్తులతో భయం భయం
- లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం
- మత్స్యకార కుటుంబాల్లోనూ అలజడి

రణస్థలం, జూన్ 7(ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలోనే అత్యధిక తీర ప్రాంతం సిక్కోలు సొంతం. జిల్లాలోని 11 మండలాల పరిధిలో 193 కిలోమీటర్ల మేర తీరప్రాంతం విస్తరించి ఉంది. జిల్లాకు సుదీర్ఘ సముద్ర తీరం వరమే అయినా.. ఒక్కోసారి సముద్రుడి ఉగ్రరూపం ప్రజలను ఇబ్బందుల్లో పెడుతోంది. సుమారు 25 శాతం ఆక్సిజన్‌ను అందించే సముద్రం.. కొన్ని సార్లు విపత్తుల రూపంలో అలజడి సృష్టిస్తోంది. వాతావరణంలో మార్పులు, కాలుష్యపూరిత అంశాల మూలంగా భూతలం మీదుగా వెళ్లాల్సిన రుతుపవనాలు.. సముద్రం మీదుగా సాగుతున్నాయి. దీంతో అలల తీవ్రత పెరుగుతోంది. అతివృష్టితో భారీగా వర్షాలు కురుస్తుండడం, వరుస విపత్తులు.. జిల్లా వాసులకు తీరని నష్టాన్ని కలుగజేస్తు న్నాయి. తీరప్రాంతం ఆక్రమణలతోపాటు.. కాలుష్యం బారిన పడుతుండడమే ఈ పరిస్థితికి కారణమని పర్యావరణ వేత్తలు స్పష్టం చేస్తున్నారు.

విపత్తులతో విలవిల..

సాధారణంగా జూన్ నుంచి సెప్టెంబరు వరకూ విపత్తుల కాలం. ఆ సమయంలో తుఫాన్ అన్న మాట వింటే మత్స్యకారులతో పాటు జిల్లా ప్రజలు వణికిపోతారు. ఇప్పటివరకూ వాటితో చవిచూసిన నష్టాలే కళ్ల ముందు కదులుతుంటాయి.

- 1999లో సూపర్ సైక్లోన్ సంభవించింది. ఒడిశాలో తీరం దాటినా ఆ ప్రభావం మన తీరప్రాంతంపై పడింది. ఉద్దానంలో 12 లక్షలకుగాపై కొబ్బరిచెట్లు నేలకొరిగాయి. 20 వేల ఎకరాల్లో జీడితోటలు ధ్వంసమయ్యాయి. ఈ విపత్తు మత్స్యకారుల జీవనోపాధిపై పెను ప్రభావం చూపింది.
- 2004లో సునామీ విధ్వంసం సృష్టించింది. ఒక్కసారిగా రాకాసి అలలు మత్స్యకారుల గ్రామాల్లోకి చొచ్చుకొచ్చాయి. సముద్రుడి విశ్వరూపం చూసి మత్స్యకారులు హడలెత్తిపోయారు. చాలా రోజుల వరకూ వేటకు వెళ్లాలంటే భయపడ్డారు.
- 2013లో ఫైలిన్ తుఫాను జిల్లాలోనే బారువ వద్ద తీరం దాటింది. ఆ సమయంలో ఈదురుగాలులకు 8 లక్షలకుపైగా కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. 8వేల ఎకరాల్లో జీడితోటలు ధ్వంసమయ్యాయి.
- 2014లో సంభవించిన హుద్‌హుద్ సైతం జిల్లాలో విధ్వంసం సృష్టించింది. 3.5 లక్షల కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. ఐదు వేల ఎకరాల జీడితోటలకు నష్టం వాటిల్లింది. ఐదువేల మత్స్యకార కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.
- 2018లో తితలీ తుపాను జిల్లా ప్రజల బతుకులను అతలాకుతలం చేసింది. వందేళ్ల చరిత్రలోనే ఇంతటి విపత్తు ఎన్నడూ చూడలేదు. 1.5లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలైన జీడి, కొబ్బరికి దారుణంగా దెబ్బతీసింది. 11 తీర మండలాల్లోని మత్స్యకారుల జీవన స్థితిగతులను మార్చేసింది.



సముద్రంలో కలుస్తున్న పరిశ్రమ రసాయన వ్యర్థాలు



దోనిపేట తీరంలో ఆలివ్‌రిడ్లే కళేబరాలు

- తీరంలో సామాజిక అటవీ ప్రాంతంలో 5 వేల ఎకరాలను అక్రమార్కులు ఆక్రమించేశారు. ఈ భూముల్లోనే రొయ్యల చెరువులు వేశారు. జీడి తోటలు సాగు చేస్తున్నారు. తీరానికి 500 మీటర్లలోపు ఎటువంటి నిర్మాణాలు జరపకూడదన్న సీఆర్‌జెడ్ నిబంధన ఉంది. కానీ తీరం చెంతనే 40 గ్రామాలు ఉండడం గమనార్హం. గాలుల తీవ్రత తగ్గించే తాటి చెట్లు, సరుగుడు, నీలగిరి తదితర చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. అలల తాకిడికి తట్టుకునే మడ అడవులు, మొగలిపొదలు కనుమరుగవుతున్నాయి. కాలుష్యంతో సముద్రంలో ఆక్సీజన్ ఇచ్చే నిమ్నవృక్ష జాతిగా పిలిచే నాచు నాశనం అవుతోంది. జిల్లాలోని ప్రవహించే వంశధార, నాగావళి, మహేంద్రతనయా, బాహుదా నదుల ద్వారా కాలుష్యం వచ్చి సముద్రంలో కలుస్తోంది. ఇంకోవైపు రణస్థలం, ఎచ్చెర్ల ప్రాంతాల్లో రసాయన పరిశ్రమల కాలుష్యాలు సముద్రంలో చేరుతున్నాయి. ఇటువంటి మానవ తప్పిదాలతో తీరప్రాంతాన్ని పాడుచేసుకుంటున్నాం. సముద్రుడి ఉగ్రరూపానికి మూల్యం చెల్లించుకుంటున్నాం. కాలుష్యం, రసాయనాలు కారణంగా విలువైన మత్స్య సంపదతోపాటు.. అరుదైన ఆలివ్‌రిడ్లే తాబేళ్లు కూడా మృత్యువాత పడుతున్నాయి.

మత్స్యకారుల గణాంకాలు

జిల్లాలో ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి రణస్థలం మండలం దోనిపేట వరకూ సముద్ర తీరం విస్తరించి ఉంది. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి, గార, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, రణస్థలం (మిగతా 6వ పేజీలో..)



యోగాసనాలు వేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే శంకర్..

యోగాతో మానసిక ప్రశాంతత

- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



శాలిహుండంలో మహిళలతో కలిసి శునకం యోగాసనాలు

గార, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గార మండలంలోని శాలిహుండం బౌద్ధక్షేత్రం యోగాసనాలకు వేదికైంది. యోగాంధ్రలో భాగంగా శనివారం కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా వేలాది మంది పాల్గొని ఆసనాలు వేశారు. ఓ పెంపుడు శునకం సైతం ఆసనాలు వేస్తూ.. ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 6లో



జామియా మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

శ్రీకాకుళం కల్చరల్/ కలెక్టరేట్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ చేసుకున్నారు. శనివారం శ్రీకాకుళంలోని ప్రసిద్ధి చెందిన జామియా మసీదులో మతపెద్ద ఇమామ్ వహాబ్ ఆధ్వర్యంలో సుమారు 1500 మంది ముస్లింలు పాల్గొని నమాజ్ చేశారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ కూడా నమాజ్ కార్యక్రమంలో పాల్గొని.. శుభాకాంక్షలు తెలిపారు. 'ఇస్లాం ఐదు మౌలిక సూత్రాలపై ఆధారపడి ఉంది. దేవుడి చూపిన మార్గంలో నడవాలి. ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి. బక్రీద్.. వేడుక మాత్రమే కాదు. భక్తి, త్యాగం, ప్రేమ, సహనం, సమానత్వం, మానవతా విలువల రూపం' అని జేసీ వెల్లడించారు. కార్యక్రమంలో మసీదు కమిటీ ప్రతినిధులు షాన్, అక్బర్ బాషా, అమీరుల్లా, షాకూర్ఖాన్, ఉస్మాన్ జాఫర్, మహిబుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయడు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతూ.. శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బక్రీద్ త్యాగానికి ప్రతీక అని పేర్కొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

శ్రీకాకుళం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. జిల్లాకు ప్రథమ సంవత్సరం ఇంటర్‌లో 47 శాతం ఉత్తీర్ణత లభించింది. 6,151 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కాగా.. 2,890 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఎక్కువగా బెటర్‌మెంట్ విద్యార్థులే ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకు 9వ స్థానం లభించింది. ఇక ఇంటర్ ద్వితీయ సంవత్సరం విషయానికొస్తే.. మొత్తం 5,525 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 3,607మంది ఉత్తీర్ణత సాధించారు. 65 శాతం ఉత్తీర్ణత లభించింది. రాష్ట్రస్థాయిలో జిల్లాకు 10వ స్థానం దక్కింది.

గురుకుల ప్రవేశ సీట్లు ఖరారు చేసుకోవాలి

శ్రీకాకుళం రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశ పరీక్ష రాసి, ర్యాంకులు సాధించిన విద్యార్థులు సీట్లను ఖరారు చేసుకోవాలని గురుకులాల జిల్లా సమన్వయకర్త జి.గ్రేస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల ఫోన్ నెంబర్లకు సమాచారం వస్తుందన్నారు. వారంతా కేటాయించిన పాఠశాల/ కళాశాలలకు వెళ్లి రిపోర్టు చేయాలన్నారు. ఇతర వివరాలకు 9701736862, 8331005217 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

జిల్లా ఆసుపత్రిలో కొవిడ్ వార్డు ఏర్పాటు

టెక్కలి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ మళ్లీ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారుల ఆదేశాల మేరకు టెక్కలి జిల్లా ఆసుపత్రిలో కొవిడ్ ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో ఆక్సిజన్, మెడికల్ కిట్లు, బెడ్లు తదితర అంశాలపై డీసీహెచ్ఎస్ కల్యాణ్‌బాబు సమీక్షించారు.

ఇది గ్రామీణ వైద్య కేంద్రమండీ!

- గోడౌన్‌గా వినియోగిస్తున్న కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు

8లో

డిగ్రీ కళాశాల మంజూరయ్యేదెప్పుడో?

- మాజీ స్పీకర్ హామీ నీటిమూటే
- సరుబుజ్జిలిలో ఉన్నత విద్యకు దూరం

7లో

మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలి

- ప్రభుత్వ హామీ నెరవేర్చాలి
- నేడు డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధుల డిమాండ్

7లో

తీవ్రమైన తలనొప్పా.. అశ్రద్ధ వద్దు

- పెరుగుతున్న బ్రెయిన్ ట్యూమర్ బాధితులు
- ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో శస్త్రచికిత్సలు
- నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే

6లో



జీడిపరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు (ఫైల్)

జీడి పరిశ్రమలు మూత

- కార్మికులకు తప్పని ఇబ్బందులు
- మరోవైపు పిక్కల ధర తగ్గుముఖం
- ఆందోళన చెందుతున్న రైతులు

వజ్రపుకొత్తూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జీడి రైతులు, కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జీడి పరిశ్రమలు తాత్కాలికంగా మూత పడడంతో కార్మికులకు ఉపాధి కరువైంది. మరోవైపు జీడిపిక్కల ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పది రోజుల కిందట 80 కిలోల జీడిపిక్కల బస్తా రూ.13వేలు ఉండగా.. గ్రామాల్లో వ్యాపారులు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం ధర రూ.12వేలకు పడిపోవడంతో పిక్కలు కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇతర దేశాల నుంచి పిక్కలు నేరుగా దిగుమతి అవుతుండడంతో ధరలు తగ్గుముఖం పడుతున్నాయని వాపోతున్నారు. వ్యాపారులు విదేశీ పిక్కల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొంటున్నారు. ఓ వైపు బస్తా పిక్కలను రూ.16వేలకు కొనుగోలు చేయాలని జీడిరైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తుండగా.. ధరలు మరింత తగ్గుముఖం పట్టడం అన్యాయమని ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలించక పిక్కల దిగుబడి తగ్గిందని, ఉన్న కాస్త పంటకు కూడా ధర తగ్గడంతో తమకు నష్టాలు తప్పేలా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి జీడిపిక్కల ధరలు పెంచి.. తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

కార్మికులకు ఉపాధి లేక..

ఉద్దానం ప్రాంతంలో జీడిపిక్కల నుంచి జీడిపప్పు వేరు చేసే పరిశ్రమల్లో వేలాది మంది (మిగతా 7వ పేజీలో..)

పొలంబాట

- జిల్లాలో ఖరీఫ్ పనులు ప్రారంభం
- వరి నారుమళ్లు సిద్ధం చేస్తున్న రైతులు

మెళియాపుట్టి/ నరసన్నపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రుతుపవనాలు రాకతో జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ముందుగానే ఖరీఫ్ పనులు ఆరంభమయ్యాయి. వర్షాలు అనుకూలిస్తుండడంతో రైతులు పొలంబాట పట్టారు. పొలాల గట్లు శుభ్రం చేసి.. వరి నారుమళ్ల సిద్ధం చేస్తున్నారు. మెళియాపుట్టి, మడపాం, మాకివలస, జమ్ము, సుందరాపురం, కంబకాయి తదితర ప్రాంతాల్లో రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు. ట్రాక్టర్లతో దుక్కి దున్ని.. నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు. మెట్టు ప్రాంతాల్లో రైతులు వేరుశనగ, మొక్కజొన్న విత్తనాలు వేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా వ్యవసాయశాఖ అధికారులు కూడా ముందస్తుగానే విత్తనాలు, ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 4లక్షల ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే 38వేల క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం చేశామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏటా విత్తనాల పంపిణీ ఆలస్యం కావడంతో రైతులు ఇబ్బందులు పడేవారు. ఆ ఇబ్బందులు పునరావృతం కాకూడదని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రైతుసేవా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



నరసన్నపేట : జమ్ములో వరినారు మడి దున్నుతున్న రైతు



శ్రీకాకుళం రూరల్‌లో..

తీవ్రమైన తలనొప్పా.. అశ్రద్ధ వద్దు



శరీరంలోని అన్ని అవయవాలను నియంత్రించేది మెదడు. మెదడులో గెడ్డ (ట్యూమర్) ఏర్పడితే, అప్పుడు పరిస్థితి చిన్నాభిన్నం అవుతుంది. అశ్రద్ధ చేస్తే ప్రాణాలకే ముప్పు. ఇటీవల బ్రెయిన్ ట్యూమర్ బాధితులు పెరుగుతున్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో ఆధునాతన శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని అంటున్నారు. ఆదివారం వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్‌డే పుస్కరించుకుని ప్రత్యేక కథనం..

నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే

- పెరుగుతున్న బ్రెయిన్ ట్యూమర్ బాధితులు
- ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో శస్తచికిత్సలు
- అందుబాటులో అత్యాధునిక వైద్యసేవలు

అరసవల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి)

తరచూ తలనొప్పి వస్తే అశ్రద్ధ చేయకూడదని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది మనం సాధారణమే అనుకున్నా కొన్నిసార్లు బ్రెయిన్ ట్యూమర్‌కు దారి తీయవచ్చంటున్నారు. తీవ్రమైన తలనొప్పితో వచ్చే వారికి బ్రెయిన్ స్కాన్ చేసి వ్యాధి నిర్ధారణ అవుతుంది. ఆతర్వాత అవసరమైన చికిత్సలు, శస్త్రచికిత్సలు చేయవచ్చు. ఒకప్పుడు 50 ఏళ్లు పైబడిన వారిలో బ్రెయిన్ ట్యూమర్‌లు ఎక్కువగా వచ్చేవని. ఇప్పుడు 15 ఏళ్ల చిన్నారులు, 30 నుంచి 40 ఏళ్ల వయస్సు వారిలోనూ వస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. బ్రెయిన్ ట్యూమర్స్ రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. చిన్న పిల్లల్లో జన్యుపరమైన లోపాలే కారణంగా చెబుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో న్యూరాలజీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ నరాలకు సంబంధించిన చికిత్సతో పాటు బ్రెయిన్ ట్యూమర్ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. అలాగే ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా మెదడులోని కణతులకు శస్త్ర చికిత్స నిర్వహిస్తున్నారు. బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్సకు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వ్యయం అవుతుంది. అయితే, ప్రభుత్వ సర్వజనాసుపత్రి, ప్రైవేటు ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా వీటిని నిర్వహిస్తున్నారు.



లక్షణాలు ఇవే..

బ్రెయిన్ ట్యూమర్ ప్రాణాంతకమైన వ్యాధుల్లో ఒకటి. దీని లక్షణాలను ప్రారంభ దశలో గుర్తించడం కష్టమేకానీ అసాధ్యమేమీ కాదు. బ్రెయిన్ ట్యూమర్ వస్తే కన్పించే అత్యంత సాధారణ లక్షణం దీర్ఘకాలిక తలనొప్పి. దీన్ని చాలామంది పట్టించుకోరు. మానసిక ఆందోళన, డీహైడ్రేషన్ వంటి సమస్య వల్ల కూడా తలనొప్పి వస్తుంది. కానీ బ్రెయిన్ ట్యూమర్ సూచించే ప్రారంభ లక్షణాలను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదు.

● తలనొప్పి

బ్రెయిన్ ట్యూమర్‌కు సంబంధించిన లక్షణాల్లో తలనొప్పి సాధారణమని వైద్యులు చెబుతున్నారు. ఈ తలనొప్పి తీవ్రంగా ఉంటుంది. కొన్ని సార్లు, రోజులో ఎక్కువ సార్లు నొప్పి రావచ్చు. కొంతమందికి తలనొప్పితో పాటు వాంతులు కూడా అవుతాయి.

● దృష్టిలోపాలు

బ్రెయిన్ ట్యూమర్ వల్ల కంటిలోని అప్టిక్ నరాలు ప్రభావితం అవుతాయి. ఒక్కొక్కసారి దృష్టి లోపం కూడా రావచ్చు. కంటి చూపులో ఎలాంటి తేడాలు కన్పించినా, మెదడులో కణితిని సూచించవచ్చునని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

● మూర్ఛలు

బ్రెయిన్ ట్యూమర్ వల్ల గతంలో ఎప్పుడూ మూర్ఛ లేని వారిలో ఇవి హఠాత్తుగా కలుగుతాయి. శరీరం వణుకుతుండడం, తదేకంగా చూస్తూ ఉండిపోవడం, స్పృహ కోల్పోవడం జరగవచ్చు.

● అశ్రద్ధ చేస్తే..

బ్రెయిన్ ట్యూమర్‌ను అశ్రద్ధ చేస్తే మూర్ఛ, పక్షవాతానికి గురై మంచానికి పరిమితమై పోతారు. మాట పడిపోవడం, జ్ఞాపకశక్తిని కోల్పోవడం జరుగుతుంది. కొన్ని ట్యూమర్‌లో క్యాన్సర్ పెరగడంతో మెదడులోని కీలకభాగాలు దెబ్బతిని కొన్ని నెలల వ్యవధిలోనే ప్రాణాంతకం కావచ్చును.

కారణాలు ఇవే..

జన్యుపరమైన లోపాలు, తీసుకునే ఆహారం, రేడియేషన్ ప్రభావం, పొగ, మద్యం తాగడం

నిర్ధారణ ఇలా..

తలనొప్పి వచ్చిన రోగికి సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్‌లు చేయడం ద్వారా బ్రెయిన్ ట్యూమర్‌లను నిర్ధారిస్తారు. ఒకప్పుడు బ్రెయిన్ ట్యూమర్ నాలుగోదశ వచ్చే వరకూ గుర్తించేవారు కాదు. నిర్ధారణ కాకపోతే, మరణించిన వారు కూడా ఉన్నారు. ఇప్పుడు అత్యాధునిక డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులోకి రావడంతో తొలిదశలోనే గుర్తించ గలుగుతున్నారు.

ఆధునిక చికిత్సలు..

బ్రెయిన్ ట్యూమర్ చికిత్సలో ఏఐ, నాన్-ఇన్‌వేసివ్ పద్ధతులు ఉన్నాయి. బ్రెయిన్ ట్యూమర్ చికిత్సలో ఇటీవల కాలంలో వచ్చిన ఆవిష్కరణలు రోగులకు సరికొత్త ఆశలను అందిస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత స్కానింగ్ పద్ధతులు, నాన్-ఇన్వేసివ్ సర్జరీలు మరింత కచ్చితంగా, సురక్షితంగా మారుస్తున్నాయి.

● బ్రెయిన్ ట్యూమర్‌ల నిర్ధారణలో ఏఐ కీలకపాత్ర పోషిస్తోంది. ఎంఆర్ఐ సీటీ స్కాన్ వంటి ఇమేజింగ్ డేటాను విశ్లేషించడానికి ఏఐ అల్గారిథమ్‌లు ఉపయోగపడుతున్నాయి. ఇవి కన్ను గుర్తించలేని అతి చిన్న ట్యూమర్‌లను, వాటి పరిధిని, స్వభావాన్ని కచ్చితంగా గుర్తిస్తాయి.

● **లేజర్, ఇంటర్‌స్టీషియల్, థర్మర్ థెరపీ (ఎల్ఐటీటీ):** ఈ పద్ధతుల్లో ఒక చిన్న లేజర్ ఫైబర్‌ను ట్యూమర్‌లోకి ప్రవేశపెడుతారు. లేజర్ శక్తిని ఉపయోగించి ట్యూమర్ కణాలను వేరుచేసి నాశనం చేస్తారు. ఇది ఎంఆర్ఐ గైడెన్స్‌లో జరుగుతుంది. ఇది కచ్చితత్వాన్ని పెంచుతుంది. ఈ అధునాతన పద్ధతులు తక్కువ నొప్పి, తక్కువ రక్తస్రావంతో వేగంగా కోలుకునే అవకాశం ఉంది.

● **ఎండోస్కోపిక్ బ్రెయిన్ సర్జరీ:** న్యూరో సర్జన్ ఒక సన్నని సౌకర్యవంతమైన ట్యూబ్ (ఎండోస్కోపు)ను ఉపయోగిస్తారు. ఈ ఎండోస్కోప్ కెమెరా, లైట్ జతచేయబడి ఉంటాయి. ఇది లోపలి భాగాలను పెద్దది చేసి స్పష్టంగా చూపిస్తుంది. ఈ ఎండోస్కోప్‌ను చాలా చిన్న కోతల ద్వారా లేదా ముక్కు, నోరు ద్వారా మెదడులోకి ప్రవేశపెడతారు. చిన్న, ప్రత్యేకమైన శస్త్రచికిత్స పరికరాలు కూడా ఎండోస్కోప్ ద్వారా పంపించి ట్యూమర్‌ను తొలగిస్తారు. ఈ శస్త్రచికిత్స వల్ల పెద్ద కోతలు, పుర్రె ఎముకను పెద్దగా తొలగించడం అవసరం ఉండదు. ఈ సర్జరీ ద్వారా రోగి త్వరగా కోలుకుని ఒకట్రెండు రోజుల్లో డిశ్చార్జి కావచ్చును.

● **కీ హోల్ సర్జరీ:** న్యూరో సర్జన్ తలపై చిన్నకోత పెడతారు. కొన్ని సందర్భాల్లో ముక్కు లేదా నోరు ద్వారా కూడా ప్రవేశపెట్టవచ్చును. దీనిద్వారా సన్నని ట్యూబ్‌ను మెదడులో ప్రవేశపెడతారు. ఎండోస్కోప్ ద్వారా లేదా పక్కనే చేసే చిన్న కోతలు ద్వారా సన్నని, ప్రత్యేకంగా రూపొందించిన శస్త్రచికిత్స పరికరాలను పంపించి ట్యూమర్‌ను పూర్తిగా తొలగిస్తారు. దీని ద్వారా శస్త్రచికిత్స తరువాత వచ్చే దుష్ప్రభావాలు చాలావరకూ ఉండవు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే మేలు..



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో బ్రెయిన్ ట్యూమర్‌లకు శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నాం. వ్యాధి నిర్ధారణకు కావలసిన అన్ని సౌకర్యాలు ఉన్నాయి. తరచుగా తలనొప్పి, దృష్టి లోపం, మూర్ఛ, నడకలో, మాటల్లో తేడాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించాలి. తొలిదశలో గుర్తిస్తే రేడియేషన్ ద్వారా పూర్తిగా కణితిని తీసేయవచ్చు. రోగి ఒక్కరోజులోనే డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లిపోవచ్చు. శతశాతం నివారణ సాధ్యపడుతుంది.

-డాక్టర్ చల్లారపు సురేంద్రకుమార్, న్యూరోసర్జన్, జీజీహెచ్

ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ఉచిత చికిత్సలు..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో బ్రెయిన్ ట్యూమర్ శస్త్ర చికిత్సలను ఉచితంగా నిర్వహిస్తున్నారు. వ్యాధి నిర్ధారణకు సంబంధించి అన్ని రకాల స్కానింగ్‌లు, పరీక్షలు అందుబాటులో ఉండడంతో విజయవంతంగా నిర్వహిస్తున్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల కేసుల్లో తలకు గాయాలైన కేసుల్లో 90 శాతం శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేస్తున్నారు.



నరసన్న చెరువులో అక్రమ నిర్మాణాలకు చేపట్టేందుకు చదును చేస్తున్న దృశ్యం

పట్టపగలే చెరువులో ఆక్రమణలు

- భారీ యంత్రాలతో చదును

నరసన్నపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున ఉన్న నరసన్న చెరువులో శనివారం కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. భారీ యంత్రాలతో చెరువ గర్భాన్ని చదును చేశారు. ఇప్పటికే చెరువు ఆక్రమణకు గురై చాలావరకు అక్రమంగా కట్టడాలు వెలిశాయి. ఈనేపథ్యంలో మరికొందరు చెరువు ఆక్రమణకు పూనుకున్నారు. జాతీయ రహదారి వైపు భూమి విలువ పెరగడంతో ఆక్రమణదారులు కన్ను చెరువుపై పడింది. 13 ఎకరాల చెరువు ఇప్పుడు ఆక్రమణలతో కుచించుకు పోయింది. అక్రమనిర్మాణాలపై స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అధికారులు వచ్చి అడ్డుకున్నారు. గతంలో చేపట్టిన ఆక్రమణలను కూడా తొలగించాలని స్థానికులు కోరుచున్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- బౌద్ధక్షేత్రంలో వేల మందితో యోగాంధ్ర

గార, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తద్వారా ఆరోగ్యవంతమైన జీవనానికి దోహదం చేస్తుందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం ఉదయం శాలిహుండం బౌద్ధక్షేత్రం వద్ద నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ప్రతీ ఒక్కరూ యోగాను అభ్యాసం చేసుకోవాలని అన్నారు. ఒకప్పుడు యోగ సాధన చేసినవారు ఎంతో ఆరోగ్యంగా ఉండేవారని, అనంతర కాలంలో దీనిని విస్మరించడంతో అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ వైజాగ్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. శ్రీకాకుళం నియోజకవర్గంలో నిత్య జీవితంలో ప్రతీ ఒక్కరూ యోగాను అభ్యాసం చేయడం వల్ల ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు



బౌద్ధక్షేత్రం వద్ద యోగాసాధన చేస్తున్న అధికారులు స్థానికులు

సుమారు గంటపాటు యోగాంధ్రలో వేలాది మంది పాల్గొన్నారు. బౌద్ధక్షేత్రంలో అన్ని రహదారులు, పార్కింగ్‌ల వద్ద యోగసాధకులతో సందడిగా కనిపించింది. తొలుత కేంద్రమంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ జ్యోతి వెలిగించి యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, డ్వామా పీడీ సుధాకర్, జిల్లా, పర్యాటక శాఖ అధికారి నారాయణరావు, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీఎస్పీ వివేకానంద, ఎంపీడీవో ఎస్.రామ్మోహన్‌రావు, తహసీల్దార్ ఎం.చక్రవర్తి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సందడిగా బక్రీద్

- మసీదుల్లో ముస్లింల ప్రార్థన

జిల్లా వ్యాప్తంగా శనివారం బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జామియా మసీదులో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మత పెద్దలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. -ఆంధ్రజ్యోతి బృందం



నరసన్నపేట: జామియా మసీద్‌లో నమాజ్ చేస్తున్న ముస్లింలు



రణస్థలం: జామియా మసీద్ వద్ద..



మత పెద్దలతో ప్రార్థనల్లో పాల్గొన్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్





పాతపట్నం: ప్రహరాజపాలెం మసీద్ కామ్రాన్‌లో నమాజ్ చేస్తున్న ముస్లింలు

విద్యుత్ స్తంభంపై పడిన మర్రిచెట్టు

ఎచ్చెర్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తోటపాలెం జంక్షన్ నుంచి కొత్తపేట గ్రామానికి వెళ్లే రోడ్డులో సైలాడపేట వద్ద శనివారం ఉదయం మర్రిచెట్టు సగభాగం వరకు నేలకొరిగి విద్యుత్ స్తంభంపై పడింది. దీంతో విద్యుత్ వైర్లు తెగి కిందపడ్డాయి. ఈ ఘటనతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ముప్పు తప్పింది. ఎలాంటి గాలి, వాన లేని సమయంలో ఐదు దశాబ్దాల క్రితం నాటి మర్రిచెట్టు నేలకొరగడంతోనే అంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు.





సైలాడపేట వద్ద నేలకొరిగిన మర్రిచెట్టు, నేలను తాకిన విద్యుత్ వైర్లు దృశ్యాలు

ప్రశాంత తీరం.. కాలుష్య కల్లోలం

(ఐదో పేజీ తరువాయి)

మండలాల్లో 164 మత్స్యకార గ్రామాలున్నాయి. లక్షకుపైగా జనాభా ఉన్నారు. మొత్తం 15,375 మంది మత్స్యకారులు వేటకు వెళ్తున్నారు. 65వేల మంది పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. ఇంజన్ ఆధారిత పడవలు 6వేలు ఉన్నాయి. వేట సాగించే రేవులు 120. ఏటా 1,48,302 మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతోంది. రూ.800కోట్ల లావాదేవీలు జరుగుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలు అందుబాటులో లేకపోవడంతో మత్స్యకారులు సంప్రదాయ రీతిలో వేటకే పరిమితమయ్యారు. ఇప్పటికీ నాటు పడవలపై ప్రమాదకర స్థితిలో వేట సాగిస్తున్నారు. స్థానికంగా వేట గిట్టుబాటు గాక జిల్లా నుంచి వేలాదిమంది మత్స్యకారులు చెన్నై, గుజరాత్, ముంబాయి, కోల్‌కత్తా, పారాదీప్ వంటి సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు.

● ఇప్పుడిప్పుడే పురోగతి..

టీడీపీ ప్రభుత్వ హయాంలో (2014-2019 మధ్య) తీరం వెంబడి రక్షణకు భారీగా మొక్కలు పెంచాలని ప్రణాళిక వేశారు. అలాగే సంతబొమ్మాళి మండలం భావనపాడులో హార్బర్ నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ సైతం పూర్తయింది, ఇంతలో ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భావనపాడులో హార్బర్ నిర్మాణం నిలిచిపోయింది. వైసీపీ పాలనలో భావనపాడులో కాకుండా.. ఇదే మండలంలోని మూలపేటలో హార్బర్ నిర్మాణానికి అప్పటి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. కానీ పనులు సక్రమంగా సాగలేదు. అలాగే వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో జెట్టీతో పాటు ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి వైసీపీ ప్రజాప్రతినిధులు హడావుడిగా శంకుస్థాపన చేశారు. కానీ పనులు మాత్రం ప్రారంభించలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం ఈ పనులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. త్వరిత గతిన పనులు పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించింది.

● పర్యాటకంగా అభివృద్ధి చేస్తేనే..

ఇంతటి సముద్ర తీరం ఉన్నా.. జిల్లా అభివృద్ధి చెందడం లేదు. తీరాన్ని పర్యాటకంగానూ అభివృద్ధి చేస్తే వేలాదిమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగపడతాయి. 11 తీర మండలాల్లో పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక కేంద్రాలను అభివృద్ధి చేయాల్సి ఉంది. జిల్లాలో టెక్కలి మండలం తేలినీలాపురం, ఇచ్ఛాపురం మండలం తేలికుంచిలో సముద్ర తీర ప్రాంతానికి దగ్గరగా విదేశీ విహంగ కేంద్రాలు ఉన్నాయి. సంతానోత్పత్తికి అనుకూలమైన వాతావరణం కావడంతో.. ఏటా సైబీరియా, జర్మనీ తదితర ప్రాంతాల నుంచి వేలాది కిలోమీటర్లు ప్రయాణించి విదేశీ పక్షులు చేరుకుంటాయి. ఏడాదిలో సుమారు ఏడు నెలలపాటు ఇక్కడే ఉంటాయి. స్థానికులను కనువిందు చేస్తాయి. గుడ్లు పెట్టి.. సంతానోత్పత్తి తరువాత తిరిగి వెళ్లిపోతాయి. సెప్టెంబరు, అక్టోబరులో ఇక్కడకు చేరుకుని.. మార్చి, ఏప్రిల్‌లో పయనమవుతాయి. ఈ విదేశీ విహంగ కేంద్రాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే.. మరింత ఆహ్లాదంగా మారనున్నాయి.

● ప్రజల్లో చైతన్యం నింపాలి

జిల్లా వెంబడి తీరం ఉండడం వరం. కానీ అదే సముద్రం ఉగ్రరూపం దాల్చుతుండడంతో ఇబ్బందికరంగా మారుతోంది. అందుకే తీర ప్రాంత రక్షణకు ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలి. ప్రభుత్వాల చర్యలతోపాటు ప్రజలు కూడా అవగాహన పెంచుకోవాలి. దీనిపై స్వచ్ఛంద సంస్థలతోపాటు విద్యాసంస్థలు చైతన్యం కలిగించాలి. తీరాన్ని పరిరక్షించుకుంటేనే భావితరాలకు మెరుగైన భవిత ఉంటుందన్న విషయాన్ని గ్రహించాలి.

-రామం, పర్యావరణవేత్త, బుడుమూరు

కొనసాగుతున్న ఐటీఐ అడ్మిషన్లు

ఎచ్చెర్ల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్ కౌన్సెలింగ్ కొనసాగుతుంది. మూడో రోజైన శనివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 296 మంది హాజరుకావల్సిఉండగా, 130 మంది హాజరై 77 మంది వివిధ ఐటీఐల్లో సీట్లు పొందారు. ఆదివారం 859 నుంచి 1035 ర్యాంకుల మధ్య గల 176 మందిని కౌన్సెలింగ్‌కు పిలిచారు. 5న ప్రారంభమైన ఈ కౌన్సెలింగ్ 8వ తేదీతో ముగుస్తుండగా, నిర్దేశించిన తేదీల్లో అనివార్య కారణాల వల్ల కౌన్సెలింగ్‌కు హాజరుకాని వారి కోసం ప్రత్యేకంగా ఈ నెల 10వ తేదీ ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కె.సుధ, అడ్మిషన్ల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు పర్యవేక్షణలో ఈ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నారు.

టీటీడీలో కూచిపూడి నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శన చేస్తున్న శ్రీలత

ఆమదాలవలస, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో ఆమదాలవలసకు చెందిన నాట్యశ్రీ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకురాలు కూన శ్రీలత కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. నాదనీరాజనం కార్యక్రమంలో భాగంగా కూచిపూడి విశ్వవిద్యాలయం నాట్యాచార్యులు చింతా రవిబాలకృష్ణ నృత్య సారథ్యంలో శ్రీలత ప్రదర్శించారు. ఈ ప్రదర్శనపై ఆమదాలవలస పట్టణానికి చెందిన పలువురు శ్రీలతకు అభినందనలు తెలిపారు.

200 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సోంపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి) ఉప్పలాం పంచాయతీ పరిధిలోని ఎకువూరులో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బారువ మెరైన్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 200మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డయాబెటిస్, ఈసీజీ, గుండె, గైనిక్, ఆర్థో, జనరల్ వ్యాధులకు చికిత్సతోపాటు ఉచితంగా మందులు అందజేసినట్టు సీఐ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ఎం.వాసుదేవరావు, ఈ.చైతన్య, ఎస్‌ఐలు ఎస్.శ్రీనివాస్, ఎన్.శ్రీనివాస్, ఏఎస్‌ఐ మాధవరావు, కూటమి నాయకులు బడే తమ్మారావు, వాసుపల్లి కృష్ణారావు, బడే సూర్యనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

గార, జూన్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం జరుగనున్న గ్రామదేవత ఉత్సవం ప్ర శాంతంగా నిర్వహిం చేలా ప్రతీ ఒక్కరూ సహకరించాలని సీఐ పైడపునాయుడు అన్నారు. శనివారం రాత్రి స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం తాగడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపు కోవాలని కోరారు. అలాగే సైబర్ క్రైమ్ విషయంలో కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాల జోలికి పోరాదని అన్నారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం


కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ గీత

ఆమదాలవలస, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలోని పలు వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. శనివారం పురపాలక సంఘంలోని 13వ వార్డు విద్యానగర్‌లో సుమారు రూ.9 లక్షలతో రహదారి, కాలువ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను దృష్టిలో ప్రతివార్డులో అభివృద్ధి కార్య క్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరికి అభివృద్ధి ఫలాలు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, నాయకులు కూన ఆంజనేయులు, మునిసిపల్ అధికారి పీవీవీకే రాజు, మునిసిపల్ సచివాలయ సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల మంజూరయ్యేదెప్పుడో?

- మాజీ స్పీకర్ ఇచ్చిన హామీ నీటిమూటే..
- ఉన్నత విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థులు
- ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న సరుబుజ్జిలి ప్రాంతవాసులు

సరుబుజ్జిలి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సరుబుజ్జిలికి డిగ్రీ కళాశాల ఎప్పుడు మంజూరవుతుందని మండలంతో పాటు పరిసర మండలాలకు చెందిన ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 2019 ఎన్నికల్లో తమ్మినేని సీతారాం ఎమ్మెల్యేగా గెలుపొంది, స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మండల కేంద్రం సరుబుజ్జిలిలో నిర్వహించిన ఓ సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ క్రమంలో ఇక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఆ తర్వాత దానిని పట్టించుకోకపోవడంతో ఈ హామీ తన ఐదేళ్ల పాలనలో నెరవేర్చలేదు. సరుబుజ్జిలి, ఎల్ఎన్ పేట, బూర్జ, జలుమూరు మండలాలకు చెందిన ఎంతో మంది విద్యార్థులకు అవసరమైన డిగ్రీ కళాశాల మంజూరుపై ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు, విద్యాశాఖాధికారులు స్పందించకపోవడంపై ఎంతోమంది పేద విద్యార్థుల ఉన్నత చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. నాలుగు మండలాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలతోపాటు ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు డిగ్రీ చదువుకోవాలంటే నరసన్నపేట, పాలకొండ, ఆమదాలవలస, శ్రీకాకుళం వంటి పట్టణాలకు వెళ్లాల్సి వస్తుంది. ఈ కళాశాలకు వెళ్లాలంటే గ్రామీణ ప్రాంతాలకు చెందిన వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు అంతంత మాత్రంగా ఉన్న ఆర్టీసీ బస్సుల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఒక్కోసారి కిక్కిరిసి ప్రమాదకరంగా రాకపోకలు సాగించాల్సి వస్తుంది. దీంతో భయాందోళన చెందుతున్న తల్లిదండ్రులు మగ పిల్లలను డిగ్రీ కళాశాలలకు పంపిస్తున్నా.. చాలా మంది ఆడ పిల్లలను ఇళ్లకే పరిమితం చేస్తున్నారు. మండల వ్యవస్థ ఏర్పడి సుమారు 35 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సరుబుజ్జిలి మండల కేంద్రానికి 20 సంవత్సరాల కిందట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసిన పాలకులు డిగ్రీ కళాశాల మంజూరు చేయడంలో నిర్లక్ష్యం చూపుతుండడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమదాలవలస పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉన్నప్పటికీ కొత్తగా మంజూరైన మరో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అదే మండలం మారుమూల ప్రాంతమైన తొగరాం గ్రామంలో కేటాయించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సరుబుజ్జిలి మండలంతో పాటు ఇతర మండలాలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు ప్రతిరోజూ ఉన్నత చదువులకు సుదూర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులకు వేలాడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో కళాశాల ప్రారంభ కానున్న నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సరుబుజ్జిలి మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల మంజూరుకు కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులకు నిత్యమూ సరుబుజ్జిలి బస్టాండ్‌లో ఇవేపాట్లు (ఫైల్)

ఉన్నత చదువులు కష్టంగా ఉన్నాయి



సుదూర ప్రాంతాలకు పంపించి పిల్లలను ఉన్నత చదువులు చదివించడానికి ఆర్థికంగా ఇబ్బంది కలుగుతుంది. కళాశాలకు వెళ్లి పిల్లలు తిరిగి ఇంటికి చేరే వరకు ఎదురుచూడాల్సి వస్తుంది. తన ఇద్దరు పిల్లలను ఇంటర్మీడియట్ వరకు చదివించేందుకు సరుబుజ్జిలిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులో ఉండడం కలిసి వచ్చింది. అయితే తన కుమారుడు డిగ్రీ చదవడానికి ప్రతిరోజూ ఆమదాలవలస వెళ్లి వస్తున్నాడు. ఆర్టీసీ బస్సులు కూడా తగినన్ని లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నాడు. ఒక్కోసారి ప్రైవేట్ వాహనాల్లో రాకపోకలు సాగించాల్సి వస్తుంది. దీంతో రోజు వారి కూలి పనులు చేసుకుంటున్న నాపై ఆర్థిక భారం పడుతుంది. మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే నాలాంటి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

- బెండి లక్ష్మణరావు, నందికొండ

ఆర్థిక స్థోమత లేదు



తనది సరుబుజ్జిలి మండలం తెలికిపెంట పంచాయతీ ఎల్‌పీఎం అగ్రహారం. తన కుమారుడు విజయ్‌కుమార్ సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసుకున్నాడు. డిగ్రీ చదివించడానికి ఆమదాలవలస, శ్రీకాకుళం వంటి సుదూర ప్రాంతాలకు పంపించడానికి ఆర్థిక స్థోమత లేదు. దీంతో ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న జలుమూరు మండలం చల్లపేటలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో చేర్పించాను. ప్రతిరోజూ సైకిల్‌పై కళాశాలకు వెళ్లి వస్తున్నాడు. తన కోసం ప్రతి రోజూ ఎదురుచూపు తప్పడం లేదు. సరుబుజ్జిలిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే ఎంతో మంచిది.

- మీగడ శివస్వామి, ఆలయ అర్చకుడు, ఎల్‌పీఎం అగ్రహారం

మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలి

- ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలి
- నేడు డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

శ్రీకాకుళం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సెకెండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు, లాంగ్వేజీ పండిట్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎన్జీవో భవన్‌లో ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. గతంలో రాష్ట్ర విద్యాశాఖ ఇచ్చిన హామీకి భిన్నంగా సెకెండరీ గ్రేడ్, లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీల బదిలీలకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ పూనుకుందని చెప్పారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో వెబ్ ఆప్షన్లను బాయ్‌కట్ చేయాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఆదివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని.. భవిష్యత్తులో పోరాటాన్ని ఉధృతం చేస్తామని సంఘ ప్రతినిధులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఎస్.కిషోర్ కుమార్, టి.మురళీమోహన్, ఎం.మదన్‌మోహన్, జి.వెంకటరమణ, బాబూరావు, శివరాంప్రసాద్, డి.కేశవరావు, పి.రాజశేఖర్, వై.ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులకు మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద పలువురు ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అంగీకరించిందని, దానికి అనుగుణంగా ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయ వర్గాలకు ఆర్థికపరమైన అంశాల్లో ప్రభుత్వం ఎటువంటి మేలు చేయకపోవడం దురదృష్టకర మన్నారు. ఇప్పటికైనా ఎస్జీటీలకు మాన్యువల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, గోపీచంద్, సీతారాం, చంద్రరావు, అప్పలనాయుడు, శ్యామలరావు పాల్గొన్నారు.

రణస్థలంలో..

రణస్థలం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రాథమి పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు మాన్యువల్ పద్ధతిలో నిర్వహించచాలని ఐక్య ఉపాధ్యాయ వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతపత్రం ఎంఈవో త్రినాథరావు అందజేశారు. ఉపాధ్యాయులు డి.కోటేశ్వరరావు, టి.శంకరరావు, బి.అప్పలనాయుడు, ఎస్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం: డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయ ఐక్యవేదిక ప్రతినిధులు



సరుబుజ్జిలి: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

టీడీపీ అధ్యక్షుడిగా 'పొందల'

కవిటి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ కవిటి మండల అధ్యక్షుడిగా పొందల కృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా పొందల కృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా బడే గురుమూర్తి, ప్రధాన కార్యదర్శిగా బెందాళం తిరుమలకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పొల్లాయి హరిహరరావు, ఎర్ర చందు, తట్ట హేరుదాసు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ఎన్నికపై మండల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

దిమ్మిడిజోలలో వీధిలైట్ల ఏర్పాటు

నందిగాం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): దిమ్మిడిజోల పంచాయతీలోని పలు కూడళ్లలో వీది లైట్లను ఏర్పాటు చేశారు. సర్పంచ్ సలాన దేవమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి కె.సంతోష్ కుమార్ పర్యవేక్షణలో సుమారు రూ.25 వేలు విలువైన బల్బులను ఏర్పాటు చేశారు. దీంతో ఆయా వీధులు శోభాయమానంగా ఉన్నాయి.

రైతులకు విత్తనాల పంపిణీ



ఎల్.ఎన్.పేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌పంటకు సంబంధించిన వరి విత్తనాలను శనివారం గ్రామ సచివాలయాల్లో పంపిణీ చేసినట్టు వ్యవసాయాధికారి పి.లతాశ్రీ తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో రైతులందరికీ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు సబ్సిడీపై విక్రయి స్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎస్.కిశోర్‌కుమార్, ఎ.పోలినాయుడు, కె.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ కుటుంబానికి పరామర్శ

ఇచ్ఛాపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మునిసిపాల్టీ 12 వార్డు కౌన్సిలర్ కుటుంబాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు పరామర్శించారు. కౌన్సిలర్ అన్నయ్య పోలారావు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శనివారం పరామర్శించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

- సరుబుజ్జిలి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పాలవలస పంచాయతీ పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన రిటైర్డు వీఆర్వో అల్లాడ వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఆమదాలవలస నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శనివారం పరామర్శించారు. ఈయన వెంట రావివలస, కొండవలస సర్పంచ్‌లు వండాన కృష్ణ, లావేటి విశ్వేశ్వరరావు, పార్టీ నాయకులు ఉన్నారు.

సామూహికంగా కుంకుమ పూజలు

పలాస, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత పెంటపోలమ్మ అమ్మవారి జాతర కన్నుల పండువగా సాగుతోంది. శనివారం రెండోరోజు ఆలయంలో మహిళలతో సామూహిక కుంకుమ పూజలు చేయించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించగా అనంతరం అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వీదుల్లో పగటి వేషాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కాశీబుగ్గ ఎల్‌సి గేటు వద్ద 50 అడుగుల ఎత్తయిన భారీ ఆలయ నమూనాను విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు.


సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

విత్తన ఎంపికతోనే అధిక దిగుబడి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త మధుకుమార్

సరుబుజ్జిలి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): విత్తన ఎంపికతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని రాగోలు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ మధుకుమార్ అన్నారు. శనివారం సరుబుజ్జిలి మండలంలోని చిగురువలస పంచాయతీ పరిధిలోని కొండ్రగూడలో కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఖరీఫ్ ముందస్తు ప్రణాళికపై రైతులకు అవగాహన కల్పించారు. మధుకుమార్ మాట్లాడుతూ.. ఖరీఫ్‌కు అనుకూల విత్తనాల ఎంపిక, పరిశోధన స్థానాలు తయారు చేసిన రకాలు వాటి లక్షణాలు వివరించారు. నేలసారాన్ని అనుసరించి రకాలను ఎన్నుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వరి పరిశోధనా శాస్త్రవేత్త కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఎరువులు, యాజమాన్యం, పచ్చిరొట్ట ఎరువులు ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో భారతీ వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్త శైలజ, కేవీకే శాస్త్రవేత్త బాలకృష్ణ, సర్పంచ్ సింహాచలం, వ్యవసాయ సహాయకుడు బెనర్జీ, రైతులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలతో ప్రయోజనం


మాట్లాడుతున్న శాస్త్రవేత్త శైలజ

బూర్జ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కాశపర్తి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, భారత వ్యవసాయ పరిశోధన మండలి వాణిజ్య పంటల పరిశోధనా స్థానం రాజమండ్రి శాస్త్రవేత్త శైలజ వరిలో వచ్చే చీడపీడల సమగ్ర సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. వరి కలుపు నివారణ, యాజమాన్య పద్ధతులపై వివరించారు. మట్టి పరీక్షలు చేయడం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో వరి పరిశోధనా స్థానం నుంచి డాక్టర్ కోటేశ్వరరావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష, సర్పంచ్ బి.వరహాలనాయుడు, మాజీ సర్పంచ్ బి.శ్రీరామ్మూర్తి, బి.గోపాలరావు, కూటమి నాయకులు పి.కులశేఖర్‌దాస్, రైతులు పాల్గొన్నారు.

జీడి పరిశ్రమలు మూత

(ఐదో పేజీ తరువాయి)

కార్మికులు లబ్ధి పొందుతున్నారు. కాగా జీడి పరిశ్రమలను ఈ నెల 2 నుంచి యజమానులు తాత్కాలికంగా బంద్ చేశారు. ఈ నెల 14వరకు మూసివేయనున్నట్టు సమాచారం. జీడిపప్పునకు అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గింది. మరోవైపు అమెరికా టారిఫ్‌ల ప్రభావంతో ఎగుమతులు కూడా తగ్గాయి. ఈ నేపథ్యంలో పప్పు నిల్వలు పూర్తిస్థాయిలో విక్రయించిన తర్వాతే.. పరిశ్రమలు తెరుస్తామని యజమానులు చెబుతున్నారు. అదే జరిగితే.. జీడిపిక్కల ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని రైతులు దిగులు చెందుతున్నారు. మరోవైపు పరిశ్రమల మూతతో ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యాలు ఎటువంటి సంప్రదింపులు లేకుండానే పరిశ్రమలు మూసివేయడం తగదని పేర్కొంటున్నారు. తమకు కనీస వేతనాలు అయినా అందజేయాలని కోరుతున్నారు. పరిశ్రమలు మూతపడిన సమయంలో.. కనీస వేతనాలు అందించేలా ఒప్పందాలు జరగాలని కార్మిక వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

కార్మికులను ఆదుకోవాలి



జీడి పరిశ్రమలు మూత కారణంగా కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిశ్రమలు మూతపడే సమయంలో కార్మికులకు కనీస వేతనం అందించేలా వేతన ఒప్పందాలు కుదుర్చుకోవాలి. జీడి కార్మికులను ఆదుకోవాలి.

- సాన కృష్ణ, సర్పంచ్, చినవంక

10 నుంచి డిగ్రీ స్పెషల్ డ్రైవ్ ఆరో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో సెమిస్టర్ ఎండ్ విధానంలో చదివిన విద్యార్థులకు ఈ నెల 10 వ తేదీ నుంచి స్పెషల్ డ్రైవ్ ఆరో సెమిస్టర్ పరీక్షలను నిర్వహిస్తున్నట్టు డీన్ డాక్టర్ జి.పద్మారావు తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌కు సంబంధించి ఇప్పటికే 1, 3 సెమిస్టర్ పరీక్షలు పూర్తికాగా, 5 సెమిస్టర్ పరీక్షలు ప్రస్తుతం కొనసాగుతున్నాయని చెప్పారు. 2,4 సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 24న ప్రారంభమై వచ్చే నెల 8వ తేదీ వరకు కొనసాగుతాయని చెప్పారు. కాగా, డిగ్రీ 6 సెమిస్టర్ పునః మూల్యాంకన ఫలితాలను విడుదలచేవామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం


ట్రాక్టర్ కింద పడిన ద్విచక్రవాహనం

పోలాకి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పోలాకి మండలం రాజపురం గుల్లవానిపేట మార్గంలో ట్రాక్టర్‌ను తప్పించబోయి బైక్ అదుపు తప్పి వృద్ధురాలు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి సంభవించింది. బెలమర గ్రామానికి చెందిన బంధువు గొర్లె తిరుపతిరావు బైక్‌పై నవగాన ఆదిలక్ష్మి(60) వెనుక కూర్చొని వెళుతుండగా.. మట్టి ట్రాక్టర్‌ను తప్పించబోయి బైక్ అదుపు తప్పి ఈ ప్రమాదం జరిగింది. దీంతో ట్రాక్టర్ టైర్ కింద పడి ఆదిలక్ష్మి మృతిచెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి..నవగాన ఆదిలక్ష్మి కోల్‌కతాలో నివాసముంటోంది. స్వగ్రామం బెలమరలో ఉంటున్న కుమార్తె వద్దకు ఇటీవల వచ్చి, తమ బంధువు తిరుపతిరావుతో బైక్‌పై వెళుతుండగా ఆమె మృతి చెందింది. మృతురాలికి ఇరువురు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు. భర్త వైకుంఠరావు రెండేళ్ల కిందట మృతి చెందాడు. కుమార్తెను చూసేందుకు వచ్చి మృత్యువాత పడడంపై ఆమె బంధువులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు. రోడ్డు ప్రమాదం కారణంగా గుల్లవానిపేట, రాజపురం, బెలమర గ్రామాల మధ్య కొద్దిసేపు రాకపోకలు నిలిచి పోయాయి. మృతదేహానికి పంచనామా జరిపించి పోస్టుమార్టం నిమిత్తం నరసన్నపేట ఆసుపత్రికి తరలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తిరుపతిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామని ఎస్ఐ రంజిత్‌కుమార్ తెలిపారు.

దన్నానపేట వద్ద మహిళ..

రణస్థలం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): దన్నానపేట జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కమ్మసిగడాం గ్రామానికి చెందిన కొరాడ సాయి(30) మృతి చెందింది. జేఆర్ పురం పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ద్విచక్రవాహనంపై ముగ్గురు వస్తూ రోడ్డు క్రాస్ చేస్తుండగా.. వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కోరాడ సాయి అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. భర్త కోరాడ రామ్మూర్తి ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ లారీ క్లీనర్..

ఎచ్చెర్ల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం ఫ్లైఓవర్‌పై శనివారం వేకువ జామున 4.30 గంటల సమయంలో జరిగిన ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి చెందగా, డ్రైవర్ గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌహతి (అసోం) నుంచి బెంగళూర్ వెళ్తున్న కొరియర్ లారీ చిలకపాలెం ఫ్లైఓవర్ దగ్గరకు వచ్చేసరికి నిద్రమత్తు కారణంగా డ్రైవర్ అసింనాథ్ ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో గాయపడిన అసోం రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్‌తో పాటు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన క్లీనర్ సుబకాష్ మర్మర్(35)ను 108 అంబులెన్స్‌పై చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ క్లీనర్ సుబకాష్ బర్మర్ మృతిచెందాడు. లారీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాల పట్టివేత

ఎచ్చెర్ల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బుడగట్లపాలెం గ్రామానికి చెందిన కారి లక్ష్మి తన పాన్‌షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 15 మద్యం సీసాలను శనివారం పట్టుకున్నట్టు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వ్యాన్ బోల్తా


అలుదు వద్ద బోల్తా పడిన వ్యాన్

జలుమూరు (సారవకోట) జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అలుదు గ్రామ సమీపంలో శనివారం మినీ వ్యాన్ రోడ్డు మధ్యలో బోల్తాపడింది. దీంతో గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. శ్రీకాకుళం నుంచి ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి కిరాణా సామాన్లతో వెళుతున్న వ్యాన్ టైర్ పేలి బోల్తా పడింది. అయితే ఈ వ్యాన్‌లో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బోల్తా పడిన వ్యాన్‌ను పక్కకు తీసి ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు. రోడ్డుకి అడ్డంగా వ్యాన్ బోల్తా పడడంతో నరసన్నపేట నుంచి పాతపట్నం వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణీకులు అవస్థలు పడ్డారు.

కొత్త వ్యక్తుల సమాచారం అందించాలి



కొత్తూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గ్రామానికి కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని డాగ్‌స్కాడ్ టీమ్ ఏఎస్ఐ గోవిందరావు అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు సిరుసువాడలో శనివారం డాగ్ స్క్వాడ్‌తో పరిశీలన చేశారు. గంజాయి వంటి మత్తుపదార్థాల నివారణపై అవగాహన కలిగించారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే అప్రమత్తంగా ఉండాలని కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- విద్యుత్ స్తంభం పడి గొర్రె మృత్యువాత
- వృద్ధుడికి గాయాలు


గాయపడిన అప్పారావు

మెళియాపుట్టి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరియాఖండి గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభం పడి గ్రామానికి చెందిన పల్లి అప్పారావుకి తీవ్ర గాయాలు కాగా ఒక గొర్రె మృత్యువాత పడింది. వివరాలిలా ఉన్నాయి.. అప్పా రావు గ్రామ సమీపంలోని పొలాల్లో గొర్రెలను మేతకు తీసుకు వెళ్లాడు. అయితే సాయం త్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ స్తంభం నేలకొ రిగింది. ఆ సమయంలో అటుగా వస్తున్న గొర్రెపై స్తంభం పడడంతో మృతువాత పడింది. అప్పారావు కాలు విరిగి పోవడంతో పాతపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈదురు గాలులతో కూడిన వర్షాలకు పాతపట్నం-మెళియాపుట్టి ఆల్‌ఆంధ్రా రోడ్డులో భారీ వృక్షాలు కూలిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

ఇది గ్రామీణ వైద్య కేంద్రమండీ..!

- సొంత గోడౌన్‌గా వినియోగిస్తున్న కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు
- రోగులకు అందని వైద్య సేవలు



సిరుసువాడ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం వరండాలో తూకం.. (ఇన్‌సెట్‌లో) సరుకు నిల్వలు ఉంచిన దృశ్యం

కొత్తూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం (విలేజ్ హెల్త్ క్లినిక్) లను నిర్మించింది. అయితే లక్ష్యం నెరవేరడం లేదు. దీంతో ప్రజలు మరలా ఇతర ప్రాంతాలకు వైద్య సేవల నిమిత్తం వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా సిరుసువాడ ఆరోగ్య కేంద్రాన్ని చెప్పుకోవచ్చు. నాలుగేళ్ల కిందట రూ.15.05 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. భవనాన్ని నిర్మించారు. అయితే బిల్లులు పూర్తిగా రాలేదన్న నెపంతో కాంట్రాక్టర్ తాళాలను సంబంధిత అధికారులకు అప్పగించలేదు. జొన్నలు, ధాన్యం, ఇతర పంటల నిల్వలు ఉంచేందుకు ఆ భవనాన్ని వినియోగిస్తున్నాడు. సరుకులను తూకం వేసేందుకు భవనం వరండాను పొంతానికి ఉపయోగిస్తున్నాడు. దీంతో ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భవనాన్ని అప్పగించకపోవడం వల్ల ఇళ్ల వరండాలు, సచివాలయ కేంద్రం ఆవరణలో వైద్య సేవలు అందించాల్సి వస్తోందని వైద్య సిబ్బంది వాపోతున్నారు. మెట్టూరు పీహెచ్‌సీ, బడగాం సబ్ సెంటర్ పరిధిలో ఉన్న సిరుసువాడ గ్రామంలో సుమారు 3 వేల మంది జనాభా నివసిస్తున్నారు. గ్రామం లోని గర్భిణులు, బాలింతలకు ఇమ్యునైజేషన్, వైద్య సేవలు అందించాల్సి ఉన్నా భవనం అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పం దించి నూతన భవనాన్ని స్వాధీనం చేసుకుని వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

80 శాతం బిల్లులు చెల్లించాం

భవనం పనులు పూర్తయి 80శాతం బిల్లులు కాంట్రాక్టర్‌కు చెల్లించాం. గతంలోనే ఈ భవనాన్ని వైద్య ఆరోగ్యశాఖాధికారులకు అప్పగించాం. ఆ భవనాన్ని స్వాధీనం చేసుకునే బాధ్యత వారిదే..

-దుర్గాప్రసాద్, జేఈ, పంచాయతీరాజ్

'నంబాళ్ల' కుటుంబానికి న్యూడెమోక్రసీ బృందం పరామర్శ


కేశవరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ ప్రతినిధులు

టెక్కలి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సీపీఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాళ్ల కేశవరావు కుటుంబ సభ్యులను న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రతినిధులు శనివారం ఆయన స్వగ్రామం కోటబొమ్మాళి మండలం జీయన్నపేటలో పరామర్శించారు. కేశవరావు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఆయన తల్లి సావిత్రమ్మను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా న్యూ డెమోక్రసీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సహాయ కార్యదర్శి వంకల మాధవ్ మాట్లాడుతూ.. కేశవరావును ప్రభుత్వం దారుణంగా హత్య చేసిందన్నారు. ప్రధాని మోదీ సర్కార్ సహజవనరులను బహుళజాతి కంపెనీలకు అప్పగించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఆయన తల్లితో మాట్లాడుతూ.. కన్నతల్లిగా మీ గర్భశోకం తీర్చలేనిదని, లక్షలాది ఆదివాసీ తల్లులకు అంతకంటే ఎక్కువ శోకం మిగిల్చిందన్నారు. తన కొడుకు నేరస్తుడు కాదని, ఎన్నడూ ఎవరికీ అపకారం చేయలేదని, అయినా నేరస్తుడిగా చిత్రీకరించి తన కొడుకు శవాన్ని ఇవ్వక పోవడం అన్యాయమని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది.

అమరావతి మహిళలను కించపరచడం దారుణం

- బాధ్యులపై చర్యలు తీసుకోండి
- ఎమ్మెల్యే గౌతు శిరీష



పలాస, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అనేక త్యాగాలు చేసి రాజధాని అమరావతికి భూములిచ్చిన మహిళా రైతులను కించప రుస్తూ మాట్లాడడం దారుణమని, తక్షణం బాధ్యులపై చర్యలు తీసుకోవా లని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు శనివారం టీడీపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మహిళలను అవమానపరిచి, అగౌరవంగా మాట్లాడిన వారికి శిక్షలు తప్పవని సీఎం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలోనూ చెప్పారని, దానికి అనుగుణంగా మాజీ సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతిని అవమానకరంగా మాట్లాడిన సొంత పార్టీ కార్యకర్తపై కేసులు పెట్టించి చిత్తశుద్ధి నిరూపించుకున్నారన్నారు. అయితే రాజధాని అమరావతికి భూములిచ్చిన మహి ళలపై నీచంగా మాట్లాడిన వారిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, మహిళా చైర్‌పర్సన్ రాయపాటి శైలజ స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

శ్రీముఖలింగేశ్వరాలయంలో శాంతిహోమం



శాంతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలోని డిండు విఘ్నేశ్వరుని సన్నిధిలో శాంతి హోమం నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, కలశారాధన, పరిషత్ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఔపాసనం, శాంతి హోమం చేశారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ నిర్వహించారు. లోక కల్యాణార్థం శాంతి హోమం నిర్వహించినట్లు అర్చకులు నారాయణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, దేవాలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరునికి ప్రత్యేక పూజలు

కొత్తూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం మెట్టూరు, వసప గ్రామాల్లో ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో శనివారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి రూ.25వేలు అందజేశారు. వసప గ్రామంలో మల్లికార్జున స్వామి ఆలయం ముఖద్వార ప్రారంభోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వలు రౌతు సుధాకరరావు, వి.వెంకటరావు, పడాల లక్ష్మణరావు, అగతముడి గోవిందరావు తదితరలు పాల్గొన్నారు. అలాగే టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి మెట్టూరు బిట్-2లో ఉమా కాశీ విశ్వేశర స్వామి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

నిర్వాసిత కాలనీలో మౌలిక వసతుల కల్పన


పాతపట్నం: సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

మెళియాపుట్టి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఆఫ్‌షోర్ నిర్వాసిత ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మౌలిక వసతు లను కల్పిస్తామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. శనివారం చీపురుపల్లి గ్రామస్థులు ఆయనను కలిసి సమస్యలు విన్నవించారు. వినతిపత్రం అందించారు. నిర్వాసిత కాలనీలో కాలువలతో పాటు పల్లె పండుగలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం మారడికోట అమ్మవారి ప్రతిష్ఠలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పేదలకు బాసటగా సీఎంఆర్‌ఎఫ్

పాతపట్నం/హిరమండలం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు బాసటగా సీఎంఆర్‌ఎఫ్ నిలుస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. హిరమండలం మండలం గులుమూరు గ్రామానికి చెందిన చెన్నూరు కోటేశ్వరరావు మృతి చెందగా ఆయన భార్య కుమారికి రూ.2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో చెక్కును అందజేశారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బగ్గు

పోలాకి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాజారాంపురం మాజీ ఎంపీటీసీ మైలపల్లి త్రినాథరావు సమీప బంధువు దౌలిపల్లి గురుమూర్తి ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వంశధార ఉప్పుగెడ్డలో పడవ బోల్తా పడి మృతి చెందిన వైనంపై అడిగి తెలుసుకున్నారు. సీఎంఆర్ఎఫ్ మంజూరుకు కృషి చేస్తానని మృతుడి భార్య నీలవేణికి భరోసా కల్పించారు. ఆయన వెంట టీడీపీ నేతలు బైరి భాస్కర రావు, సూరపు నారాయణదాస్, మైలపల్లి త్రినాధరావు, కోడ తాతారావు తదితరులు ఉన్నారు.

నేడు సత్సంగం

పోలాకి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): దండులక్ష్మీపురం పంచాయతీ చింతాడపేట స్వామి రామయోగి సేవాశ్రమంలో ఆదివారం సత్సంగం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమం అధ్యక్షుడు బమ్మిడి విశ్వనాథం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఒడిశా రాష్ట్ర దేవానందాశ్రమ అధ్యక్షుడు అలియాన వినయ్‌కుమార్ అతిథిగా హాజరవుతారన్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త తూలుగు తిరుపతిరావు సత్సంగం అనంతరం సొండిపేట అభయాంజనేయ భజన బృందం వారిచే భజనా కార్యక్రమం, అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు తరలిరావాలన్నారు.

నేడు వయోవృద్ధులకు యోగా శిక్షణ

టెక్కలి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో యోగాంధ్ర-2025లో భాగంగా ఆదివారం వయో వృద్ధులకు ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. టెక్కలి పెన్షనర్ల సంఘ భవనంలో ఉదయం 6.30 గంట లకు ఒక గంట పాటు యోగాలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పెన్షనర్లతో పాటు వయో వృద్ధులు కూడా హాజరు కావాలని వారు కోరారు.

మాజీమంత్రి మతిభ్రమించి మాట్లాడుతున్నారు

- ఏపీటీపీసీ చైర్మన్ బాబూరావు

పలాస, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గంలో వ్యాపారాలతో ఎమ్మెల్యే గౌతు శిరీష భర్త వెంకన్న చౌదరికి సంబంధం లేకున్నా మాజీమంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు మతి భ్రమించి మాట్లాడుతున్నారని టీడీపీ నేతలు విమర్శించారు. శనివారం స్వగృహంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతిసారి అల్లుడి ట్యాక్స్ అంటూ మాట్లాడుతున్నారని, దీనిని ఎక్కడైనా నిరూపిస్తే తాము దేనికైనా సిద్ధమన్నారు. ఇసుక, మట్టి, కంకర, మద్యం దందాలని పదే పదే ఆరోపిస్తున్న మాజీ మంత్రి వీటిని నిరూపించాలని సవాల్ విసిరారు. ఆదాయపు పన్ను చెల్లించిన ఓ వైద్యుడిగా పేదలకు అందాల్సిన తెల్ల రేషన్ కార్డుల ద్వారా సరుకులు తీసుకున్న దొంగ-దొర ఎవరో ప్రజలకు తెలుసునన్నారు. మరోమారు వెంకన్న చౌదరిపై నిందలు వేస్తే పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, నేతలు గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్‌గుప్తా, మల్లా శ్రీనివాస్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, ఎం. నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు

రాతికర్ర చెరువులో అక్రమ నిర్మాణాల పరిశీలన


చెరువు వద్ద నిర్మాణాలను పరిశీలిస్తున్న ఆర్డీవో సాయి ప్రత్యూష

నరసన్నపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రాతికర్ర, జలగల చెరువుల్లో అక్రమ నిర్మాణాలను శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష శనివారం పరిశీలించారు. పట్టణంలోని రాతికర్ర చెరువు స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఎన్‌జీటీకి గర్భిట్ గైడ్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో ఇరిగేషన్, రెవెన్యూ సర్వేశాఖల అధికారులతో కలిసి పరిశీ లించారు. రాతికర్ర, జలగల చెరువుల విస్తీర్ణం, నిర్మాణాలు, ఆయకట్టు భూమి తదితర వివరాలతో నివేదిక అందజేయాలని సర్వే అండ్ రెవెన్యూ అధికారులకు ఆర్డీవో ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ, మండల సర్వేయర్ అప్పలస్వామి, ఆర్ఐ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

'షైనింగ్ స్టార్స్' అవార్డుకు విద్యార్థుల ఎంపిక

సంతబొమ్మాళి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్స్ అవార్డుకు మండలం నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పట్నాన శ్రీమృదుల (బోరుభద్ర జడ్పీహెచ్ఎస్), చక్క సమజ్ఞ (దండుగోపాలపురం), కొన్న వసంత, ఉంకిలి షన్ముఖరావు (సంతబొమ్మాళి), దాసరి సౌమ్యశ్రీ (వల్లేవలస), విశాల్ సాహు (ఎంజేపీ పాఠశాల) ఎంపికయ్యారని మండల విద్యాశాఖాధికారి జలుమూరు చిన్నవాడు తెలిపారు. వీరికి ఈనెల 9న శ్రీకాకుళంలో జరగనున్న కార్యక్రమంలో రూ.20 వేల నగదు, ప్రశంసా పత్రాలు అందించనున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులను డీజీపురం పాఠశాలల హెచ్ఎం గంగన్న, భాస్కరరావు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

నందిగాం నుంచి నలుగురు..

నందిగాం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కరబరిచిన మండలంలోని నలుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికయ్యారని ఎంఈవో జి.నర్సింహులు తెలిపారు. అవార్డుకు ఎంపికైన వారిలో గిన్ని అనుష్క (కణితివూరు ఉన్నతపాఠశాల), బాలక జశ్వంత్ సాయి (లభిదాసుపురం), యానాది దివ్య (నందిగాం బాలికల గురుకులం), నవర లోకేశ్ (నవరలింగుపురం గిరిజన ఆశ్రమ పాఠశాల) ఉన్నారన్నారు. సోమవారం శ్రీకాకుళంలో జరగనున్న కార్యక్రమంలో అవార్డులు అందిస్తారని తెలిపారు విద్యార్థులను పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

కొత్తూరు నుంచి ఆరుగురు..

కొత్తూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్స్ అవార్డులకు మండలం నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈవో గోవిందరావు తెలిపారు. 10 వ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. పప్పు మోక్షేశ్వరి, బర్రి హారణి, పాలో అరుణకుమార్, నంబూర్ సాహిత్, టొంపల లచ్చిత, కొండగిర్రి ఫణీంద్రలకు సోమవారం అవార్డులను శ్రీకాకుళంలో అందజేస్తారన్నారు. ఈ సందర్భంగా వారిని హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

హిరమండలం నుంచి ఐదుగురు..

హిరమండలం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపికయ్యారని ఎంఈవో రాంబాబు తెలిపారు. పెద్దింటి నిఖిల్, గంధం జయంతి కుమార్, గంధం జెశ్విని, టంకాల షర్మిలా పూజిత, అందవరం భరత్ ఎంపికైనట్లు తెలిపారు. వీరిని హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుంచి గ్రామదేవత ఉత్సవాలు


విద్యుద్దీపాలతో శోభాయమానంగా ఉన్న పీవీ పురం పాలపోలమ్మ ఆలయం

నందిగాం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రతాపవిశ్వనాథపురం, మదనాపురం గ్రామాల్లో ఆదివారం నుంచి మూడురోజుల పాటు గ్రామదేవత ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పీవీపురంలో పాలపోలమ్మతల్లి సిరిమానోత్సవం, మదనాపురంలో చింతలపోలమ్మ, పాత పట్నం అమ్మ, ఎర్రన్న తండ్రి, బేతాలమ్మ అమ్మ వార్ల ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సు

టెక్కలి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల నుంచి ప్రతిపాదనలు పంపిన మేరకు కమిషనర్ ఆఫ్ కాలేజ్ ఎట్ ఎడ్యుకేషన్ అధికారులు పీజీ కంప్యూటర్స్ సైన్స్‌ను సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుగా మంజూరు చేసినట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

ప్రైవేటు పాఠశాల సీజ్

టెక్కలి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థను శనివారం ఎంఈవో తులసీరావు సీజ్ చేశారు. కాలం చెల్లిన ధ్రువపత్రాలతో పాఠశాలను కొనసాగిస్తున్నారని అధికారుల విచారణలో తేలిందని, నిబంధనలకు విరుద్ధంగా శనివారం పాఠశాల తెరిచి ఉంచడంతో ఎంఈవో అక్కడకు చేరుకొని ఆరా తీశారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో పాఠశాల గేటుకు సీలు వేసినట్లు ఎంఈవో తెలిపారు.